క్లుప్తంగా

ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించాలి



తనిఖీ చేస్తున్న పోలీసులు

ముధోల్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సీఐ మల్లేశ్ అన్నారు. ఆదివారం ముధోల్‌లోని భైంసా–బాసర జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. మద్యం, సరైన పత్రాల్లేకుండా బంగారం, డబ్బులను తీసుకెళ్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పంటపై అడవిపందుల దాడి

కుంటాల:మండలంలోని వెంకూర్ గ్రామ శివారులో అడవి పందులు శనివారం రాత్రి మొక్కజొన్న పంటలపై దాడి చేశాయి. రైతులు బాజీరావు, రాజేశ్వర్, కాంతారావు, మనోహర్‌కు చెందిన పంటలను ధ్వంసం చేశాయి. అటవీశాఖ పందుల కట్టడికి చర్యలు చేపట్టి తమకు నష్టపరిహారం అందించాలని రైతులు వేడుకుంటున్నారు.

బోథ్ ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

మామడ: మండలంలోని జగదాంబతండా గ్రామంలోని జగదాంబదేవి ఆలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. తరచుగా ఆలయాలను సందర్శిస్తే ఆధ్యాత్మిక భావనలు పెరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సజన్, శ్రీరాంనాయక్, రమేశ్, ప్రతాప్ ఉన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ వాయిదా

నిర్మల్‌రూరల్: పాఠశాలల్లో సోమవారం నిర్వహించాల్సిన నులిపురుగుల నివారణ మాత్రల కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు డీఈఓ రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ విషయం గమనించి విద్యార్థులకు, పోషకులకు తెలియజేయాలని సూచించారు. మాత్రలు పంపిణీ చేసే తేదీని త్వరలో చెబుతామని పేర్కొన్నారు.

ముధోల్ ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామారావు

భైంసాటౌన్: పట్టణంలోని నిర్మల్‌రోడ్డులో ఉన్న సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ హాజరై అమ్మవారికి పూజలు చేశారు. ఆయనను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం భక్తుల కోసం అన్నదానం చేశారు.

'రాజకీయ లబ్ధి కోసమే వర్గీకరణ'



నిరసన తెలుపుతున్న సభ్యులు

లక్ష్మణచాంద: రాజకీయ లబ్ధి కోసమే ఎస్సీ వర్గీకరణను తీసుకొస్తున్నారని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల కన్వీనర్ మెట్టు ప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని గ్రామాల మాల సంఘాల ఆధ్వర్యంలో కనకాపూర్ గ్రామం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సోన్ సీఐ నవీన్‌కుమార్, ఎస్సై సుమలత అక్కడకు వచ్చి నచ్చజెప్పడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు సాయన్న, సుధాకర్, ఈశ్వర్, మోహన్, గంగాధర్, విజయ్, మాల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కల్తీపై చర్యలు తీసుకోవాలి

ఖానాపూర్: మండలంలోని కిరాణా దుకాణాలు, సూపర్ మార్కెట్లలో విక్రయిస్తున్న కల్తీ వస్తువులను అరికట్టాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ఆర్ ఉపాలి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కల్తీ విక్రయాలతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. కల్తీ నూనెలు, ముక్కిన సామగ్రి, చిన్నారుల తినుబండారాలు పూర్తిగా కల్తీగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

పొట్టేళ్ల పెంపకంతో లాభాలు

- కుభీర్‌లో తక్కువ శ్రమ, పెట్టుబడితో వ్యాపారం
- పిల్లలను కొని ఆరునెలలు సాదుతున్న పెంపకందారులు
- బరువు పెరగగానే మార్కెట్‌లో అమ్ముకుంటున్న వైనం



జబ్బార్ షెడ్డులో పెంచుతున్న గొర్రె, మేకపిల్లలు

కుభీర్: మండలకేంద్రమైన కుభీర్‌లో గొర్రె, మేకపోతుల పెంపకం చేపట్టి మంచి లాభాలు గడిస్తున్నారు కొందరు పెంపకందారులు. ఓ వైపు వ్యవసాయం, తమ ఇతర వృత్తులు చేసుకుంటూనే ఇంటి వద్ద, చేను వద్ద షెడ్లు వేసి ఈ పొట్టేళ్లను పెంచుతున్నారు. పచ్చిగడ్డితోపాటు మొక్కజొన్న, సోయా విత్తనాలు, ఇతర దాణా అందిస్తూ.. బరువు పెరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ఇలా మండల కేంద్రంలో 20 మందికి పైగా పొట్టేళ్ల వ్యాపారం చేస్తూ ఆదాయం పొందుతున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి..

నిజామాబాద్ జిల్లా నవీపేటతోపాటు ఇతర ప్రాంతాలకు వెళ్లి మూడు నెలల వయసున్న గొర్రె, మేక పిల్లలను ఒక్కోటి రూ.మూడు వేల నుంచి రూ.నాలుగు వేల మధ్య కొనుగోలు చేసి.. ఆరు నెలలపాటు ఇంటి వద్ద పెంచుతారు. ఇలా ఒక్కొక్కరు తమ వీలును బట్టి పది, ఇరవై, ముప్పై పిల్లలతో కూడిన బ్యాచ్‌లను పెంచుతున్నారు. అనంతరం బహిరంగ మార్కెట్‌లో ఒక్కో పొట్టేలును రూ.12 వేల నుంచి రూ.14 వేల వరకు విక్రయిస్తున్నారు.

షెడ్ల శుభ్రత పాటిస్తూ..

షెడ్లను శుభ్రంగా ఉంచుతూ ఈ జీవాలకు వ్యాధులు రాకుండా బ్లీచింగ్ చల్లుతూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పశువైద్యాధికారులను పిలిపించి అవసరమైన మందులు తాగించి.. ఇంజక్షన్లు వేయిస్తున్నట్లు పెంపకందారులు పేర్కొంటున్నారు. మరో వైపు వీటి ఎరువును రైతులకు అమ్ముకొని అదనపు ఆదాయం పొందుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

పొట్టేళ్లను పెంచే పెంపకందారులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. షెడ్లను ప్రతిరోజు శుభ్రం చేయడం, జీవాలకు నట్టలమందు, ఇతర మందులు సకాలంలో తాగించాలి. విటమిన్లను ఇంజక్షన్ రూపంలో ఇస్తుండాలి. సాధారణంగా ఈ పిల్లలకు మూడు నెలల వరకు ఎలాంటి వ్యాధులు రావు. పెంపకందారులు మమ్మల్ని సంప్రదిస్తే అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తాం.

– కె.ప్రకాశ్, పశువైద్యాధికారి, కుభీర్

పదేళ్లుగా ఇదే పని..

మండల కేంద్రానికి చెందిన కొందరు కందర్ దేవన్న, కందుర్ దత్తాత్రి, కురనప్ బాబన్న, షేక్ బజ్జార్, బాహుద్దీన్, పుప్పాల శ్రీనివాస్, పుప్పాల దత్తాత్రి, బొజ్జె భోజన్న తదితరులు పదేళ్లుగా ఇలా పొట్టేళ్ల బ్యాచ్‌లను పెంచుతూ.. అమ్ముకుంటూ లాభాలు పొందుతున్నారు. మాంసపు దుకాణాలకు, మహారాష్ట్రలోని పాలజ్ భోకర్, మేకల బజార్లకు వెళ్లి వీటిని అమ్ముతారు. మక్క చొప్పతోపాటు ఇతర పచ్చిగడ్డిని అందించడం ద్వారా బరువు పెరుగుతాయని పేర్కొంటున్నారు.

పదేళ్లుగా పెంచుతున్నా..



పదేళ్లుగా పొట్టేళ్లను పెంచుతున్నా. ఐదెకరాల్లో వ్యవసాయం చేస్తూనే ఈ పిల్లల పెంపకం చేపట్టా. మా షెడ్డులో ప్రస్తుతం 30 గొర్రెపిల్లలు ఉన్నాయి. జాగ్రత్తలు తీసుకుంటే నష్టం ఉండదు. వాటి పేడ ఎరువుగా ఉపయోగపడుతుంది. ఆరు నెలలు మంచిగ చూసుకుంటే 15 కిలోల వరకు పెరుగుతాయి.

– కందుర్ దేవన్న, కుభీర్

లాభదాయకమే..



ఇప్పటివరకు మూడుసార్లు పొట్టేళ్లను అమ్మి లాభాలు పొందా. ప్రస్తుతం మాషెడ్డులో 10 గొర్రెపిల్లలు, మూడు మేకపిల్లలు ఉన్నాయి. వాటిని నెల కిందట మూడు వేలకొకటి చొప్పున కొన్నా. ఓ వైపు ప్లంబింగ్ పని చేస్తూనే ఈ వ్యాపారం కొనసాగిస్తున్నా.

– షేక్ జబ్బార్, కుభీర్

మరమ్మతు చేస్తుండగా కరెంట్‌షాక్

- ఇద్దరు విద్యుత్ సిబ్బందికి గాయాలు

మామడ: మండలంలోని కప్పన్‌పల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో ఆదివారం మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మెన్ అనిల్, వాచ్‌మెన్ నారాయణ గాయపడ్డారు. 33కేవీ లైన్ తీగల కింద చెట్ల కొమ్మలను తొలగిస్తుండగా సమీపంలోనే ఉన్న 11 కేవీ తీగ తగిలి వీరు మరమ్మతు చేస్తున్న తీగలపై పడింది. దీంతో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా అయింది. దీంతో స్తంభంపై మరమ్మతులు చేస్తున్న అనిల్ కాలి బొటనవేలుకు, నారాయణకు తొడభాగంలో గాయాలయ్యాయి. అనంతరం గాయపడిన వారిని నిర్మల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.



చికిత్స పొందుతున్న నారాయణ

పీఆర్టీయూ ఆవిర్భావ వేడుకలు

భైంసాటౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని సంఘ భవనంలో పీఆర్టీయూ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన పలువురిని శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు, నూతన పీఆర్సీ, ఏకీకృత సర్వీస్ నిబంధనలు, ఇతర సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సుభాశ్, నరేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జైశివరాం, పుండలిక్, ఉపాధ్యక్షులు మల్లికార్జున్, సలీం హైమద్‌ఖాన్, జమీల్ అహ్మద్‌ఖాన్ తదితరులున్నారు.

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ సంఘ భవనంలో ఆదివారం పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జెండాను ఎగురవేశారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, నర్సయ్య, సాయినాథ్‌రెడ్డి, గంగాధర్, రాజేందర్, ముత్తన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భైంసాలో సన్మానగ్రహీతలతో నాయకులు

గజ్జలమ్మదేవి ఉత్సవాలు ప్రారంభం



కుంకుమార్చనలో మహిళలు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మదేవి ఆలయ ఐదో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. శ్రీ గురుమంచి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో ఉదయం భగవతి ప్రార్థన, విశేష సంకల్పం, మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, సంస్కారం, వాస్తు, క్షేత్రపాలక, నవగ్రహ యోగిని, కర్కరి, సర్వతోభద్ర మండలస్థాపన, అగ్నిప్రతిష్ఠ, స్థాపిత దేవతాహోమం, గ్రామస్తుల రథ జలాభిషేకం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా కుంకుమార్చనలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామంలో పెద్దమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు బోనాలు



తరోడాలో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు



కడెం : బోనాలతో మహిళలు

ముధోల్: మండలంలోని తరోడాలో గ్రామస్తులు గ్రామదేవతలకు బోనాలను నైవేద్యంగా సమర్పించారు. ఆదివారం తెల్లవారుజామున గోదావరి నది తీరం నుంచి గంగాజలం తీసుకొచ్చి పోచమ్మ, మైసమ్మ ప్రతిమలతోపాటు శివాలయంలో అభిషేకాలు నిర్వహించారు. అంతకుముందు భక్తులు ఊరేగింపుగా బోనాలను ఆలయాలకు తీసుకెళ్లారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

కడెం: మండలంలోని పాతకొండుకూర్ గ్రామంలో ముత్యాల పోచమ్మకు బోనాలను నైవేద్యంగా సమర్పించారు. కుండల్లో వండిన బోనాన్ని మోదుగ ఆకుల్లో పోచమ్మకు నైవేద్యంగా సమర్పించారు.

లోకేశ్వరం: మండలంలోని ధర్మోరలో గ్రామదేవతలైన ముత్యాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మహిళలు చలబోనాలను నైవేద్యంగా సమర్పించారు. ప్రతి ఇంటి నుంచి బోనం తీసుకొచ్చి ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు మంద లింగన్న, భైండ్ల సాయన్న, అబొదీన్‌పటేల్, ప్రసాద్ పటేల్, ఆకుల భోజన్న, పిప్రి నర్సాగౌడ్, ఒడ్డెన్న, జంబుగ సాయన్న, కూతడి నవీన్, నరేశ్, మనాల దేవిదాస్, సాయన్న ఉన్నారు.



లోకేశ్వరం : ఆలయానికి వెళ్తున్న మహిళలు

సన్మానం

కడెం: జిల్లా ఆర్టీఏ సభ్యులుగా నియమితులైన మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామానికి చెందిన తుమ్మల మల్లేశ్‌ను, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రెంకల శ్రీనివాస్‌ను లింగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. అనంతరం వారు అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ నాయకుడు రహీంను పరామర్శించారు.ఇందులో సలీం, కోల శ్రీనివాస్, రాజు, తదితరులున్నారు.

12 నుంచి కబడ్డీ ఎంపిక పోటీలు

కుంటాల: మండల కేంద్రంలోని విజయసాయి పాఠశాలలో ఈనెల 12నుంచి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు భూపతిరెడ్డి, కార్యదర్శి సునీల్ ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 16 ఏళ్లలోపు వయస్సు, 55 కిలోలలోపు బరువు ఉండాలని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు వికారాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డు తీసుకుని ప్రిన్సిపాల్ స్వప్న, పీఈటీ అరవింద్‌ను సంప్రదించి రూ.100 ఎంట్రీ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9666396029, 72870 95083 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

ఖానాపూర్: పట్టణంలోని ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాలను ఆదివారం డీఐఈవో పరశురాంనాయక్ తనిఖీ చేశారు. ప్రభుత్వ జూనియర్, ఏఆర్ఎస్ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్‌లు హమీద్, భూక్య రమేశ్‌నాయక్ తదితరులున్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



నిర్మల్‌లో సమావేశమైన 2003-06 డిగ్రీ బ్యాచ్ విద్యార్థులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2003–06లో డిగ్రీ చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల తర్వాత నిర్మల్‌లోని ఉత్సవ్ కన్వెన్షన్ హాలులో కలుసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఉల్లాసంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు.

పెంబి: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995–96లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 29 ఏళ్లకు తాము చదువుకున్న పాఠశాలలోనే మళ్లీ కలుసుకొని ఉల్లాసంగా గడిపారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో గురువులు శ్యామ్ సుందర్ చారి, మురళీధర్, గంగారాం, సుదర్శన్, శ్రీనివాస్, బాలాజీ, ఖాజా పూర్వవిద్యార్థులు ఉన్నారు.



పెంబి : 1995-96 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు

అనుబంధ సంఘంగా గుర్తింపు

ఖానాపూర్: రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అనుబంధ సంఘంగా ఖానాపూర్ పట్టణంలోని తిమ్మాపూర్ మున్నూరుకాపు సంఘం గుర్తింపు పొందిందని తిమ్మాపూర్ సంఘం అధ్యక్షులు నిమ్మల రమేశ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని సంఘ భవనంలో రాష్ట్ర మున్నూరు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరు, సభ్యుల సమక్షంలో ప్రకటించారు. ఈ మేరకు తిమ్మాపూర్ సంఘ సభ్యులకు గుర్తింపు పత్రం అందజేశారు. అంతకముందు ప్రధాన రహదారిపై రైతు విగ్రహానికి పూలమాలలు వేశారు. ఖానాపూర్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పస్పుల నరేందర్, నాయిని సంతోశ్, తిమ్మాపూర్ ప్రధాన కార్యదర్శి బీసీ రమేశ్, తదితరులున్నారు.



రైతు విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

గిట్లుంటే రోగాలు రావా?



రైతువేదిక సమీపంలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు



జూనియర్ కళాశాల ఆవరణ వద్ద..



పీహెచ్‌సీ సమీపంలో దుస్థితి..



గాంధీ విగ్రహం సమీపంలో చెత్తాచెదారం

లక్ష్మణచాంద: మండలకేంద్రమైన లక్ష్మణచాందలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. జూనియర్ కళాశాల, రైతువేదిక, ఎంపీడీవో కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలతోపాటు పలు కాలనీల్లో మురుగు కాలువలు పూడిక, చెత్తాచెదారంతో నిండిపోయాయి. కొన్నిచోట్ల ఇళ్ల నుంచి వచ్చిన మురుగునీరు రోడ్డుపైనే పారుతోంది. నిల్వనీటితో దుర్గంధం వస్తుందని.. దోమల వ్యాప్తి పెరిగి రోగాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువలను శుభ్రం చేయించాలని ఆయా కాలనీల ప్రజలు వేడుకుంటున్నారు.

శ్రీ మార్కండేయ పద్మశాలి సంఘం కార్యవర్గం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని ప్రియదర్శినినగర్ శ్రీ మార్కండేయ పద్మశాలి సంఘం ఉత్తర విభాగం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక నందన డిగ్రీ కళాశాల ఆవరణలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు చిలక రమణ, ప్రధాన కార్యదర్శి అల్లం అశోక్, పోపా జిల్లా ప్రధాన కార్యదర్శి బొద్దుల రమణ, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్ద రమణ పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా గురుడ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా నరిమెట్ల జగదీశ్, నరిమెట్ల సాయికిరణ్, ప్రధాన కార్యదర్శిగా మాన్పురి లక్ష్మణ్, కోశాధికారిగా ఓం ప్రకాశ్, సెక్రెటరీగా అవదూత్ భూమేశ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సగ్గం హరిచరణ్, ఆడిటర్‌గా మైసర్ల సతీశ్, గౌరవ సలహా సభ్యులుగా తాళ్ల కిషన్, గర్దాస్ చక్రధర్, రేగుంట నరేందర్, బైండ్ల భూమేశ్, మద్దెర్ల భోజన్న, ఆడెపు సుభాశ్ ఎన్నికయ్యారు.